క్లుప్తంగా

నడిపల్లిలో వస్త్రాల పంపిణీ



నడిపల్లిలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని నడిపల్లి గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం వస్త్రాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజాప్రతినిధి లంకలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది గ్రామస్తులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామస్తురాలు రామాంజిలమ్మ జ్ఞాపకార్థం వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

17 నుంచి ఉరుసు ఉత్సవాలు

విజయనగరం టౌన్: స్థానిక కోట జంక్షన్ వద్ద నున్న డెంకెషావలీబాబా ఉరుసు మహోత్సవాలు ఈ నెల 17 నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు దర్గా వంశపారంపర్య సేవకులు ఖాదమ్ షేక్ బహదూర్ షేక్ షాజహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో ఖురాన్ పఠనంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అంబటిసత్రం జంక్షన్ నుంచి బాబా సందల్ మహా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఉంటుందని, భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

నిరుపేదలకు వస్త్రాల పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని సర్పంచ్ కోట్ల రామునాయుడు 800 మంది గ్రామస్తులకు సుమారు రూ.3 లక్షలు విలువ చేసిన వస్త్రాలు చీరలు, దుప్పట్లు, పంచెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామంలో ప్రజలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్క కుటుంబం పండగను సుఖసంతోషాలుతో గడుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గ్రామస్తులు కోట్ల రేవతి, కల్యాణపు హరిబాబు, కె. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ అధికారి యు.రమణ ఆధ్వర్యంలో మంగళవారం, బుధవారం ఘనంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం ప్రముఖ నాట్యాచారిణి సాయిసుప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులు భరతనాట్యం, జానపద నృత్యాల ప్రదర్శన అలరించాయి. బుధవారం సాయంత్రం మయూరి నృత్యాలయం ఆధ్వర్యంలో శ్రీదేవీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యాలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన కె.నాగమణి, బి.నీహారిక, పి.తేజస్వినిలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా బ్రహ్మాలింగేశ్వర స్వామి తీర్థం



కొండగుళ్లులో తోడ పెద్దును కొండ ఎక్కిస్తున్న భక్తులు

వేపాడ: మండలంలో ప్రసిద్ధి చెందిన కొండ గుళ్ల బ్రహ్మాలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సింహాద్రప్పన్న తోడపెద్దును భక్తులు కొండ ఎక్కించి ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేయించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే బొద్దాంలో నెయ్యిల పేరంటాల మ్మ తీర్థం నిర్వహించారు.

ఘనంగా లక్ష్మమ్మ తల్లి జాతర



గంట్యాడ: పూజలందుకుంటున్న లక్ష్మమ్మ తల్లి

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో లక్ష్మమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏటా కనుమ పండగ నాడు అమ్మవారి జాతర జరపడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

నిర్మానుష్యంగా రోడ్లు



నిర్మానుష్యంగా మూడు లాంతర్ల కూడలి

విజయనగరం పట్టణంలోభోగి, సంక్రాంతి పండగ రోజుల్లో జన సందోహంతో కళకళలాడిన రోడ్లు. కనుమ రోజు మాత్రం బోసి పోయాయి. ముఖ్యంగా కనుమ అనగానే దుమ్ముల పండగ. మరి ఇంటి దగ్గరే అందరూ ఆటపాటల తో పండగ జరుపుకోవడంతో రోడ్లు బుధవారం నిర్మానుష్యంగా మారాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



రాజీవ్ క్రీడామైదానం రోడ్డు ఇలా..



గంటస్తంభం రోడ్డు



రైల్వేస్టేషన్ రోడ్డు



కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డు



కనుమ రోజు తెరవని షాపులు



మయూరి కూడలి రోడ్డు

ఘనంగా గోపూజోత్సవం



ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

• పైడితల్లి అమ్మవారికి అరిసెలతో నివేదన

విజయనగరం టౌన్: సంక్రాంతి , కనుమ పర్వదినాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి కనుమరోజున అరిసెలతో నివేదన చేశారు. ఆలయమంతా సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో టీటీడీ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో బుధవారం గోపూజోత్సవం నిర్వహించారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి నేతృత్వంలో గోపూజోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో గోపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తరించారు.



అరిసెల నైవేద్యంతో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సంక్రాంతి పండగ



పినతాడివాడలో కోళ్లను పట్టుకుని ఇళ్ల వద్దకు వచ్చిన భక్తులు

డెంకాడ: మండల వ్యాప్తంగా గ్రామాల్లో మెజార్టీ కుటుంబాలు పెద్ద పండగ పేరుతో మంగళవారం సంక్రాంతిని నిర్వహించుకున్నాయి. తెల్లవారు జాము నుంచే సంక్రాంతి పూజలు నిర్వహించారు. పేరంటాళ్లను ఇంటిలోకి తీసుకు వచ్చి పసుపు, కుంకుమలు పెట్టి పూజించారు. అనంతరం వాయనం అందజేశారు. అలాగే గ్రామాల్లో దేవుడు ఇళ్లల్లో ఉన్న కోళ్లను పట్టుకుని మేళతాళాలతో ఆయా కుటుంబాలకు చెందిన ఇళ్లకు వెళ్లారు. ఆ కుటుంబాలకు చెందిన వారు కోళ్లకు పసుపు ,కుంకుమలు పెట్టి పూజారికి మొక్కారు. దీంతో గ్రామాల్లో సంక్రాంతి పండగ శోభ కనిపించింది. చిన్నాపెద్దా తేడా లేకుండా సంప్రదాయంగా నూతన వస్త్రాలను ధరించి సందడి చేశారు.

జూట్ యాజమాన్యం బోనస్ వెంటనే చెల్లించాలి

నెల్లిమర్ల: జూట్‌మిల్ యాజమాన్యం బోనస్ వెంటనే చెల్లించాలని జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూట్‌యాజమాన్యం 2023వ సంవత్సరానికి సంబంధించిన బోనస్ ఈనెల 8న చెల్లిస్తానని చెప్పి మాట తప్పి ఇంతవరకు బోనస్ ఇవ్వలేదన్నారు. అలాగే యాజమాన్యం తన బినామీల ద్వారా బోనస్ చెల్లించడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం వచ్చిందని అయినా సరే ఇంతవరకు బోనస్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడం భావ్యంకాదన్నారు. క్రిస్టియన్ సోదరులకు గతనెల బోనస్ చెల్లించారని, మిగతా కార్మికులకు ఇంతవరకు బోనస్ చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కాబట్టి స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, లేబర్ అధికారులు స్పందించి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో లేబర్‌కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



పరుగుతీస్తున్న ఎడ్లు



ఎడ్ల పరుగు ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామంలో కృష్ణరాయుడు స్వామి తీర్థం సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించి న ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ బాలబాబు, గ్రామపెద్దలు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 15 జతల ఎడ్లు పాల్గొనగా, దేవరాపల్లికి చెందిన లక్ష్మీనరసింహ ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచి రూ.12వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. రెండోస్థానంలో వల్లంపూడి గ్రామానికి చెందిన సిద్ధివినాయక ఎడ్లు, మూడో స్థానంలో వావిలపాడు గండి వెంకటరావు ఎడ్లు, నాలుగో స్థానంలో కలగాడకు చెందిన పి.రామునాయుడు ఎడ్లు నిలిచాయి. ఆరువేలు చొప్పున నగదు బహుమతులు అందచేసారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, నాయకులు కె.పెదనాయడు,బి.శ్రీను,తదితరులు నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

ఆంజనేయస్వామికి ఫలాలతో అలంకరణ



పండ్ల అలంకరణలో బాలాంజనేయస్వామి

వేపాడ: రామస్వామిపేట గ్రామ సమీపంలోని శ్రీఅష్టాంశ వరద బాలాంజనేయ ఆలయంలో సంక్రాంతి సందర్భంగా స్వామి వారిని మంగళవారం వివిధ ఫలాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అష్టోత్తర శతనామ, ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: మకర సంక్రాంతి సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం భక్తులకు సంక్రాంతి లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు దూసి శ్రీధర్ అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

కబడ్డీ క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులతో గ్రామపెద్దలు

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో వినాయక యువజన సంఘం సంక్రాంతి సందర్భంగా గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులు లగు డు అజయ్‌కుమార్, పతివాడ వినయ్‌కుమార్, కోచ్ ఆల్తి తాతబాబును సర్పంచ్ యాళ్ల వెంకటరమణ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు.సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన తాతబాబు తదితరులు గ్రామానికి మంచి పేరు తెచ్చి పెట్టారని సర్పంచ్ వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.ఎంపీటీసీ బోదల దేముడు, స్థానిక పెద్దలు కొసరి రామారావు, ఆల్తి బుచ్చిబాబు, ఆల్తి రమణ, తానవరపు అప్పలనాయుడు, కబడ్డీ క్రీడాకారులు టొంపల అప్పన్న, మత్తి గురుమూర్తి, మండల సతీష్, సారిక కోటరావు, తదితరులు పాల్గొన్నారు.

చినపతివాడలో హోరాహోరీగా క్రికెట్ పోటీలు



చినపతివాడ క్రికెట్ పోటీల్లో విజేతలు

పూసపాటిరేగ : మండలంలోని చినపతివాడ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా హోరీహోరీగా క్రికెట్ పోటీలు జరిగాయి. ఈనెల 12 వతేదీ నుంచి 15 వతేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగిన క్రికెట్ పోటీలలో ఐదు జట్లు పాల్గొన్నాయి. చివరగా సీపీ లైన్స్ టీం విజేతగా నిలిచింది. ఆ తరువాత రెండవ స్థానంలో సీపీ రైడర్స్ నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు పతివాడ భాస్కరరావు, పతివాడ గౌరి, పాలూరి దుర్గాప్రసాద్, వలిరెడ్డి గౌరి, బద్రి సురేష్, పతివాడ నాగేంద్ర, పతివాడ తరుణ్, మైపాడ రాము, మైపాడ శ్రీను, పాలూరి జగన్నాథం, మైపాడ గోపి, వలిరెడ్డి రాము, మైపాడ రామునాయుడు, చందక మోహన్, పిస్నింటి అప్పలనాయుడు, బుత్తల రమేష్, కిమిడి లక్ష్మీనారాయణ, మైపాడ సతీష్, యతిరాజ్యం మోహన్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

జాతీయ పతాకానికి వీర కంకణం



ఆదినారాయణను సత్కరిస్తున్న వేదిక ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: భారతీయులకు ఉత్సాహం నింపే ప్రేమను పంచే జాతీయ పతాకానికి వీరకంకణం దేశ సైనికుడేనని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. భారతదేశ సైనిక దినోత్సవం సందర్భంగా దాసన్నపేటలో నివాసముంటున్న ఆర్మీలో అత్యంతకీలకమైన కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసి వీరోచిత పోరాటం చేసిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఉంగ ఆదినారాయణను పౌరవేదిక ప్రతినిధులు బుధవారం సత్కరించారు.ఈ సందర్భంగా భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ సైనికులది ఉద్యోగం కాదని త్యాగమని, అంతకు మించి పోరాటాన్ని కర్తవ్యంగా భావిస్తారని, అసమాన కీర్తితో బతుకుతూ దేశం కోసం నిత్యపోరాటం చేస్తూనే తన చివరి శ్వాస రణభూమిలోనే నని తెలిసి జీవిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు పి ప్రభాకర్‌రావు, జె.రామచంద్రరాజు, గోపాలరావు, మొయిద శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చీపురుపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షుడు ఇప్పిలి అనంతం అన్నారు. రామలింగాపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొంటున్నాయి కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.